# యేసు ఎవరు?

“మేము మమ్మునుగూర్చి ప్రకటించుకొనుటలేదు గాని,
క్రీస్తుయేసును గూర్చి ఆయన ప్రభువనియు,
మమ్మును గూర్చి, యేసు నిమిత్తము మేము
మీ పరిచారకులమనియు ప్రకటించుచున్నాము”
*2 కొరింథీ 4:5*


**పీటర్ వాకర్**

**www.1peter1three.weebly.com**

Translated and designed by
Good Shepherd Media, Secunderabad 500 067
E-mail: printing@ombooks.org

# విషయసూచిక


పరిచయము . . . . . . . . . . . . . . . . . . . . . . . 5

యేసు ఎవరు? . . . . . . . . . . . . . . . . . . . . . . 7

క్రీస్తు సందేశము . . . . . . . . . . . . . . . . . . . . . 9

నమ్మకము . . . . . . . . . . . . . . . . . . . . . . . 11

దాచబడిన ధనము . . . . . . . . . . . . . . . . . . . . 14

రక్తము . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 16

ఆత్మ . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 18

ఆహ్వానము . . . . . . . . . . . . . . . . . . . . . . . 20

క్రొత్త జీవితము . . . . . . . . . . . . . . . . . . . . . 23

ఉటంకించిన లేఖనములు. . . . . . . . . . . . . . . . . . 26

ఈ చిన్న పుస్తకం పాఠకులైన మీకే అంకితం.
యేసుక్రీస్తు గురించి మీతో పంచుకునే అవకాశం
ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు.
నాకు బైబిల్‌పరమైన విద్యాభ్యాసం గాని, అనేక
వేదాంతపరమైన అంశాలపై అవగాహనగాని లేవు. ఏది
ఏమైనా, నేనొక యేసు అనుచరుణ్ణి, లేఖనాలంటే నాకెంతో
ప్రేమ. అందుకే, కొన్ని తలంపులు మీతో పంచుకోనివ్వండి...

# పరిచయము

*'యేసు ఎవరు?' అనే ప్రశ్న మీరు అడుగుతున్నట్లయితే – నిజంగా మీరొక అద్భుతమైన స్థానంలో ఉన్నట్టే!*

ఇప్పుడు మీకు దేవునిమీద కోపంగా ఉండొచ్చు, లేక దేవునిపై మీకు నమ్మకం లేకపోవచ్చు. లేదా మీరు దేవుణ్ణి నమ్ముతారు కాని, మీ మనస్సుకు ఏదో గాయమైంది. బహుశా మీరు హైందవులో, ముస్లిములో, బౌద్ధమతస్తులో లేక ఏ ఇతర మతానికో చెందినవారైయుండవచ్చు. లేదంటే, మీరు పూర్తిగా, ఓ భిన్నమైన, మీరు వివరించలేని స్థానంలో ఉండి వుండవచ్చు.... ఏది ఏమైనా, మీరెలా భావిస్తున్నా, ఎక్కడున్నా సరే, ప్రియ మిత్రమా, బైబిల్ గ్రంథంలో– మొదటి పుస్తకం నుంచి చివరి పుస్తకం వరకు– ఉన్న దేవుడు మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాడు, ఒకవిధంగా మిమ్మల్ని అర్థిస్తున్నాడు: **యేసు ఎవరు** అని ప్రశ్నించి తెలుసుకోమని.

ఇక్కడ నేను వివరించని, జవాబు చెప్పలేని ప్రశ్నలు మీకెన్నో ఉండవచ్చు. నిజానికి, ఈపుస్తకంలో నేను కేవలం ఒక 'విశ్వాసి'గా మాత్రమే మీతో మాట్లాడి, కొన్ని తలంపులు మీతో పంచుకొంటాను. నా ఆధారమంతా నా విశ్వాసము, బైబిల్ గ్రంథము, దేవుని ఆత్మనే.

బైబిల్ లోని 66 'గ్రంథాలు' లేదా రచనలు – ప్రేరేపించబడిన దేవుని వాక్కు అని నేను నమ్ముతాను. మంచివి, 'సత్యమైనవి'గా పేర్కొనబడిన ఇతర గ్రంథాలవలె, బైబిల్‌ని కూడా అపార్థం చేసుకొని, దుర్వినియోగపరచి, సందేహించే అవకాశం ఉంది. అయితే, బైబిల్‌ని ఉపయోగించడంలో మానవపొరపాట్లు ఎలావున్నా,

యథార్థంగా సత్యాన్ని అన్వేషించేవారికి ఇది దేవునియొక్క నమ్మకమైన ఆధారంగా నిలుస్తోంది. చదవడానికి సులభంగా ఉండేందుకా అన్నట్లు ఈ గ్రంథాన్ని 'విద్యలేని పామరులు' రాసారు. బైబిల్‌లో దేవుడు మనకు కనిపించకుండా దాచుకోలేదు; ఆయనే మనకు స్వయంగా బయలుపరుచుకున్నాడు!

**యేసు ఎవరు**? అనే ఈ ప్రాముఖ్యమైన ప్రశ్న విషయంలో నా తలంపులను మీతో పంచుకోవడానికి ఇక ఆలస్యమెందుకు?

# యేసు ఎవరు?

యేసు క్రీస్తు – మానవరూపంలో ఉన్న దేవుడు అని బైబిల్ మనకు బోధిస్తోంది. యేసు అంటే 'ప్రభువు రక్షించును' అని అర్థం. దేవుణ్ణి మనం వ్యక్తిగతంగా తెలుసుకొని, దేవునితో సంపూర్ణ సంబంధం కలిగివుండేందుకు వీలుగా దేవుడు పరలోకం నుంచి దిగివచ్చి భూమి మీద నరావతారి అయ్యాడు.

యేసు 'శరీరధారి'గా ఉన్న దేవుడు. ఆయన మన పాపాలను క్షమించి, మనకు నిత్యజీవాన్ని ప్రసాదించడానికి వచ్చాడు. ఈయనే యేసు, అందుకే ఆయన ఈలోకానికి వచ్చాడు.

## ప్రత్యక్షత

ఇది ఎంతో గంభీరమైన, గ్రహింపశక్యం కాని సత్యమని స్వయంగా బైబిలే సెలవిస్తోంది. మనల్ని రక్షించడానికి దేవుడు మానవరూపం ధరించాడనే ఈ సత్యాన్ని 'గ్రహించడం' మన వల్ల కాదు. ఇది మనకు అర్థంకాదు! ఇది చాలా పెద్ద విషయం! అవును, ఈ సత్యం – ఇంత అద్భుతమైన సత్యం – మన జ్ఞానానికి మించినది అని బైబిల్ చెప్తుంది!

దేవుని గూర్చిన – అనగా యేసు క్రీస్తును గూర్చిన ఈ సత్యం – 'ఆత్మయు సత్యము' అని, ఇది మనస్సుతో గ్రహించేది కాదని, మన ఆత్మలకు, మన హృదయాలకు కలిగే 'ప్రత్యక్షత' వల్లనే అర్థమవుతుందని మనకు చెప్పబడుతోంది.

నాలాగే, అనేకుల మాదిరిగానే, మీరు కూడా దేవుణ్ణి గ్రహించాలని, లేక ఆయన్ని మీ మనస్సులో ఇమిడేలా చేసుకోవాలని ప్రయత్నిస్తే, మన ఆత్మలు, హృదయాలు

ముందుండి నడిపించడం చాలా కష్టమవుతుంది. అయితే, మిత్రమా, ఇప్పుడు మీ జీవితంలో మీకు విలువైనవన్నీ – మీ స్నేహితులు, కుటుంబం, సంతోషం, ప్రేమ, సమాధానం, క్షమాపణ, కరుణ– వంటివి మనస్సుకు సంబంధించిన సత్యాలు కాదు, హృదయానికీ, ఆత్మకు సంబంధించిన సత్యాలు. నిజానికి మనం అనేకసార్లు 'హృదయసంబంధమైన సత్యాన్ని' లేక ఓ సంబంధాన్ని మన మనస్సులతో, అవగాహనతో గాయపరిచాం. ***మీరెప్పుడైనా మీ హృదయం కంటె మీ 'బుర్ర'కే ప్రాధాన్యత ఇచ్చి, ఆ తరువాత దాని విషయమై చింతించారా?*** ఒకవేళ దేవుడు నా చిన్న బుర్రలో ఇమిడిపోయి లేక ఎప్పుడు ఎలా వుంటుందో చెప్పలేని నా 'అవగాహనకు' సరిపోయినట్లుంటే, ఆ దేవుడు చాలా చిన్న దేవుడైయుంటాడు, నిజంగానే!

'దేవుడు ఆత్మ గనుక, ఆయనను ఆరాధించేవారు ఆత్మతోను సత్యముతోను ఆయనను ఆరాధించాలి' అని బైబిల్లో ఉంది. 'నా మాటలు ఆత్మయు జీవమునై యున్నవి' అని యేసు తన మాటల గురించి స్వయంగా చెప్పాడు.

**?**

**యేసును గూర్చిన సత్యము నీ మనస్సుకు సవాలుగా ఉండి, అది నీ హృదయమనే తలుపుమీద తట్టుతుందని మీకు అనిపిస్తోందా?**

# క్రీస్తు సందేశము

'విశ్వసించండి' అని యేసు ప్రజలకు విన్నవించిన విధానం ఆసక్తికరంగా ఉంటుంది. డబ్బు, లేక సంపద ఇస్తానని ఆయన రాలేదు. వేదాంతపరమైన ప్రశ్నలకు జవాబులు ఇవ్వడానికి కూడా కాదు ఆయన వచ్చింది. ఆయన చెప్పిన మాటలు ఇలా వుండేవి, *"మీలో ఎవరైను దప్పిగొనిన యెడల నాయొద్దకు వచ్చి దప్పి తీర్చుకొనవలెను... నాయందు విశ్వాసముంచువాని కడుపులోనుండి జీవజల నదులు పారును."* మనము దప్పిగొన్నామా అని యేసు ప్రశ్నిస్తున్నాడు, అలాంటివారికి 'జీవజలము' ఇస్తానని వాగ్దానం చేసాడు. ఇది మన రోజువారీ జీవితవిధానంలో ఇమడదు. అయినప్పటికీ, ఇది నేరుగా మన ఆత్మను తాకి, అంతకన్నా ఎక్కువైన ఏదో మన అవసరాన్ని తీర్చేదిగా అనిపిస్తుంది.

***'మీరు దప్పిగొన్నారా?' అని యేసు అడిగిన ఈ ప్రశ్న – మీ ఆత్మలో మారుమ్రోగి నట్లుందా?***

లేక, ఉదాహరణకు, యేసు జనసమూహాల వైపు తిరిగి, 'మీలో ఎవరైన *అలసిపోయారా?'* అని అడిగాడు. అప్పుడాయన వేరొక విధమైన 'విశ్రాంతి' నిస్తానని వాగ్దానం చేసాడు.

యేసు అద్భుతకార్యాలు చేసాడు, అయితే వాటి వెనుక ఒక ప్రత్యేకమైన ఉద్దేశం ఉంది. ఒకసారి ఆయన ఓ పెద్ద జనసందోహంలో మాట్లాడుతూ, ఆయన అద్భుతకార్యాలు చేయడానికి గల కారణం వివరించారు. పాపాలను క్షమించగలిగే అధికారం ఆయనకున్నదని మనం అర్థంచేసుకోవడానికే ఆయన ఈ అద్భుతాలు జరిగించాడు. కేవలం కొందరి జీవితాలను కొంతకాలం వరకు మెరుగుపరచడంకోసమే ఆయన అద్భుతాలు జరిగించలేదు. మన

పాపాలను క్షమించి, 'మన పేర్లు జీవగ్రంథంలో రాయడానికే' ఆయన అద్భుతాలు జరిగించాడు.

మరి, ఆయన సందేశం ఏమిటి? నా ఆత్మలో ఈ 'జీవాన్ని' ఈ 'విశ్రాంతి'ని ఈ 'జీవజలాలను' నేను ఎలా పొందగలను?

అక్షరాల, వ్యక్తిగతంగా... యేసు సందేశం సజీవంగా మనయొద్దకు వస్తోంది...

"నేనే ద్వారము, నా ద్వారా వచ్చువాడు రక్షణపొందును' అని యేసు చెప్పాడు. యేసు దేవుని గురించి బోధించలేదు; దేవున్ని తెలుసుకునేందుకు తనవద్దకే రమ్మని యేసు మనల్ని ఆహ్వానించాడు. ఇప్పుడు మీ జీవితంలో మీరు కలిగియున్న లోతైనది 'ఒక వ్యక్తి'నే గాని ఒక వస్తువునో లేక ఒక భావననో కాదు. దీనిగురించి ఒక నిమిషం ఆలోచించండి. ***మీ జీవితంలో మీకు ఎంతో అమూల్యమైనది ఏమిటి?*** ఒక వ్యక్తే అని నేను గ్యారంటీగా చెప్పగలను. దేవుడు కూడా అంతే. దేవుని గూర్చిన లోతైన సత్యము – ఆయనే. నరునిగా మారడంలో ఆయన ఉద్దేశం నీవూ నేను ఆయనను చూచి, తాకి, తెలుసుకోవడమే. నిజానికి యేసుకున్న పేర్లలో ఒకటి 'ఇమ్మానుయేలు' – అనగా 'దేవుడు మనకు తోడైయున్నాడు' అని ఆ పేరుకు అర్థం. ఇప్పుడు, ఎల్లప్పుడూ – మనతో సదాకాలం ఉండటానికే దేవుడైన యేసు మానవునిగా ఈ లోకానికి వచ్చాడు.

**దేవుణ్ణి నీవు వ్యక్తిగతంగా తెలుసుకోవాలనుకుంటున్నావా?**

# నమ్మకము

ఆయనయందు విశ్వాసముంచుమని యేసు మనల్ని సవాలు చేస్తున్నాడు. ఆయన ప్రజలతో ఉన్నప్పుడు ఇచ్చిన ఆహ్వానం ఇదే, గనుక వారాయనను చూడగలిగారు. వారు ఆయనను చూడగలిగినప్పుడు, ఆయనయందు విశ్వాసముంచడం గురించి ఇంతలా నొక్కిచెప్పడం ఎందుకు? ఈ 'విశ్వాసం' అనే అంశం విషయంలో నాకు రెండు సంగతులు జరుగుతాయి.

## *1. నిజమైన స్నేహితుడు నిన్ను నమ్ముతాడు!*

నీ స్నేహితుణ్ణి అని చెప్పుకుంటూ నీ పక్షంగాఉండని వ్యక్తి ఎవరైనా నీకు తెలుసా? ఈ వ్యక్తి నిన్ను చూస్తాడు, నీ గురించి అతనికి తెలుసు, అతని దగ్గర ఉన్నప్పుడు నిన్ను గుర్తిస్తాడు కూడా; ఈ వ్యక్తికి నీతో 'సంబంధం' ఉంది, గాని అతడు నిన్ను నమ్మడు. నిజానికి వారు తమ హృదయంలో ఒక భాగాన్ని మీకు మూసివేసారు. ***మీ సంబంధాలలో ఇలాంటి అనుభూతి, అనుభవం మీకు పరిచయమేనా?***

యేసు – శరీరధారియైన దేవుడు – 'మనతో' ఉండడానికి వచ్చాడు. ఇమ్మానుయేలు అను ఆయన పేరుకు *'దేవుడు మనకు తోడైయున్నాడు'*[1] అనే అర్థం వస్తుంది. యేసు కేవలం నీవు ఆయన్ని గుర్తిస్తే చాలు అనుకోవడం లేదు; నీ ప్రేమ, 'నమ్మకం' నీతో సంబంధం కలిగివుండాలని వచ్చాడు. ఒకరి పట్ల ఒకరు కలిగివుండే నమ్మకమే నిజమైన స్నేహానికి ప్రాణాధారం.

"నేను మిమ్ములను స్నేహితులని పిలుచుచున్నాను" అని యేసు చెప్పాడు. తన

---

[1] యెషయా 7:14/ మత్తయి 1:23

స్నేహితునికోసం ప్రాణంపెట్టడం కంటే ఎక్కువగా తన ప్రేమను చూపగలిగే గొప్ప మార్గం మరొకటి లేదని కూడా యేసు చెప్పాడు.[2]

## *2. చూచినంత మాత్రాన నమ్మినట్లు కాదు!*

యేసు ఈలోకంలో ఉన్నప్పుడు చాలామంది ఆయన శక్తిని చూసారు, కాని ఆయనయందు విశ్వాసం ఉంచలేదు. నాలాగే, బహుశ మీరు కూడా ఇలా అనుకొని లేదా అనికూడా ఉండవచ్చు, *"నిజంగా నేను యేసును 'చూచి' ఉంటే . . ."* సత్యం ఏమిటంటే, శరీరధారిగా ఆయనను చూచి, ఆయన కనుపరచిన అద్భుత శక్తులను కళ్లార చూచినవారిలో అనేకులు ఆయన యందు విశ్వాసముంచలేదు. చాలాసార్లు ఆయన అద్భుతాలు చేసినప్పుడు, నిజానికి, ప్రజలు ఆయనకు విరోధులయ్యారు. చివరికి, ఆయనను 'చూచిన' ప్రతి ఒక్కరూ – ఎవరైతే ఆయన మాటలు విన్నారో, ఆయనతో నడిచారో, ఆయన జరిగించిన అద్భుతాలు, సూచకక్రియలు అనుభవించారో – వారందరూ ఆయనమీద కుట్రపన్నడమో లేక ఆయన్ని వదిలి వెళ్లిపోవడమో చేసారు. ఆయనను 'చూచిన' వారందరి కళ్లెదుట, పట్టపగలు ఆయనను హతమార్చారు.

కనుక యేసు మనల్ని 'నమ్మకం', 'విశ్వాసం' కొరకు పిలుస్తున్నాడు గాని 'చూడటానికి' కాదు. మనుష్యులు ఆయనను చూచి ఆయనను చంపారు. మన కళ్లతో చూచినదాని విషయంలో మనల్ని మనమే నమ్మలేము, దానిని వెంబడించలేము. శిష్యులవలె మనం కూడా చూచినదాన్ని కొంతకాలం నమ్మవచ్చు, ఆ తరువాత మన కళ్లు, మన మనస్సులు, మన హృదయాలు మనల్ని మోసగిస్తాయి గనుక మనం వెంబడించడం మానేస్తాం. మనం చూచినదానికి, ఒకప్పుడు ప్రేమించిన దానికి విరోధంగా కూడా మనం మారవచ్చు.

శిష్యుడైన తోమాతో యేసు ఇలా చెప్పాడు, 'చూచి నమ్మినవానికంటె చూడక నమ్మినవారు ధన్యులు.'

భూమ్మీద, మన హృదయనేత్రాలతో 'చూచి' విశ్వసించాలని – అనగా – ఆయనను స్వీకరించి, అనుసరించి, విధేయులై, ఆరాధించాలని యేసు మనల్ని

---

[2] యోహాను 15:13–15

కోరుతున్నాడు. యేసు నీతో నిజమైన సంబంధాన్ని, స్నేహాన్ని కలిగివుండాలని కోరుతున్నాడు! ఒక రోజు మనం మహిమలో ప్రవేశిస్తాం, అక్కడ మన నేత్రాలు పవిత్రంగా, మన హృదయాలు స్థిరంగా ఉంటాయి, అక్కడ మనము ఆయనను 'ముఖాముఖి' చూస్తాం. అయితే ప్రస్తుతానికి, విశ్వసించుమని అడుగుతున్నాడు.

**మీ హృదయ నేత్రాలతో యేసును చూస్తున్నామని మీకు అనిపిస్తోందా?**

# దాచబడిన ధనము

***యేసును 'చూచి' నమ్మడం కష్టం ఎందుకు? లోకమంతా యేసును గూర్చి విని విశ్వసించకపోవడానికి కారణం ఏంటి?***

లేఖనాలను చదివినప్పుడు, దేవుడు పనిచేసే విధానం చూచి నేను ఆశ్చర్యపోయాను. ఆదినుంచి, దేవుడు ప్రతి ఒక్కరినీ సమానంగా ప్రేమించినప్పటికీ, కొందరు దేవుణ్ణి 'తెలుసుకున్నారు', కొందరు తెలుసుకోలేదు. దీన్ని అర్థం చేసుకొని, తెలుసుకొని వివరించడం మనకు అసాధ్యం.

యేసు ఈ భూమిమీద నడచి, బోధించి, అద్భుతకార్యాలు జరిగించినప్పుడు కూడా సరిగ్గా ఇలాగే ఉండేది. కొందరు ఆయన పాదాలపై పడి, 'నీవే దేవుడవు!' అని చెప్పారు. ఇతరులు ఆయనను నీచంగా చూచి, హేళనచేసి, ఆయన అధికారాన్ని సవాలు చేసారు. ఇది ఎలా సాధ్యం? ఒకరు క్రీస్తులో దేవుణ్ణి చూడగా, మరొకరు క్రీస్తును చూచి కేవలం ఒక మానవునిగానే పరిగణించడం ఎలా జరిగింది? దీన్ని వివరించడం నావల్ల కాదు!

అయితే, యేసు జీవితమంతటిలోను, ఆయన బోధలలోను నేను చూచిందేమంటే, ఆయన తనను తాను ఎంతో లోతైనరీతిలో బయలుపరచుకున్నాడు. ఎంతో లోతుగా, ఎంతో స్థిరంగా! ఒక వ్యక్తి యేసు ఎవరో నిజంగా చూచినప్పుడు – దేవుడు మనకు తోడైయున్నాడు – అనే రహస్యం ఆ వ్యక్తి హృదయాన్ని చేరి, అతన్ని శాశ్వతంగా మార్చివేసింది. అయితే ఈ రహస్యం లేక బయల్పాటు ఎంతో లోతైనది, పవిత్రమైనది, స్థిరమైనది గనుక, అది మనలో చాలామందిమి గమనించలేనంత వేగంగా జరిగిపోతుంది. జీవితంలో మనం పైపైన విషయాలతో ఎంతగా దృష్టిమళ్లించబడుతున్నామంటే, దేవునికి సంబంధించిన లోతైన సంగతులు మనల్ని అలా దాటిపోతుంటాయి.

ఈ సత్యాన్ని వివరించడానికి యేసు ఒక చిన్న ఉపమానం చెప్పాడు. *“పరలోకరాజ్యము, పొలములో దాచబడిన ధనమును పోలియున్నది. ఒక మనుష్యుడు దాని కనుగొని దాచిపెట్టి అది దొరికిన సంతోషముతో వెళ్లి, తనకు కలిగినదంతయు అమ్మి ఆ పొలమును కొనును.”* [3]

**యేసు నీకు ఓ గొప్ప ధననిధిగా కనబడుతుండగా నీ చుట్టు ఉన్నవారు అలా చూడలేకపోతున్నట్లు నీకు అనిపిస్తోందా?**

# ◈ రక్తము

యేసు కథ నమ్మశక్యంకానిది! మన పాపపు 'మరక'లనుండి మనలను విడిపించడానికి ఆయన దేవుడైయుండి మనకోసం వచ్చాడని మనకు చెప్పబడింది. లోతైన మన పాపాలు ఒక రక్తపు మరకను కలిగివుంటాయని మీకు తెలుసు. ప్రజలకు ప్రాణాధారమైన రక్తము, హింస, వేధింపులు, దురదృష్టం, మరణం ఉన్నచోట ఒలికించబడుతుంది. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మనందరి చేతులపై ఆ మరకలున్నాయి. బానిసత్వం, వేధింపుల పునాదులపై కట్టబడిన ప్రపంచంలో మనం జీవిస్తున్నాము, మనమందరం రక్తాన్ని చిందించడమో, లేక ఇతరులు రక్తమోడ్చి సంపాదించుకున్న వస్తువులను దొంగిలించడమో చేసివుంటాం. ఇది మనల్ని అసౌకర్యానికి గురిచేసే నిష్ఠుర సత్యం – అయితే, రక్తపాతం అనేది మన లోకపు చీకటిలోను, దేవునికి మనం దూరమైన స్థితిలోను కనిపిస్తుంది.

అందుకే యేసు వచ్చి, ఈ పాపము, చీకట్ల నుంచి మనల్ని విడిపించాలనుకుంటున్నాడు. ఆయన వచ్చి మనకు జరిగిన అన్యాయం నుంచి, మనం చేసిన అన్యాయం నుంచి మనల్ని విడిపించాలనుకుంటున్నాడు. ప్రతి ఆత్మను, ప్రతి హృదయాన్ని, ఆఖరికి మనం జీవించే ఈ నేలను సహా స్వస్థపరచాలనుకుంటున్నాడు. ఈ 'విమోచనకు' 'పాపక్షమాపణకు' మార్గాన్ని నమ్మశక్యం కాని, ఈ ఆత్మీయవిధానంలో యేసు మార్గం తెరిచాడని మనకు చెప్పబడుతోంది: ***యేసు మన పాపాన్ని తన వ్యక్తిత్వంలోనికి, తన శరీరంలోనికి తీసుకొని దానితోసహా మరణించాడు.*** దీన్ని బైబిల్లోని ఒక వచనం ఇలా చెప్పింది: "ఆయన మనకోసము *పాపము అయ్యాడు"* [4]

---

[4] 2 కొరింథీ 5:21

యేసు నా అపరాధాన్ని, అవమానాన్ని తనపై వేసుకొని, నాకోసం మరణించాడు. నా పాపంతోపాటుగా మరణించిన యేసు, మృతులలోనుండి తిరిగి లేచాడు, కాని ఆయనతో పాటు నా పాపం తిరిగి రాలేదు. అంటే, పాపాన్ని ఆయన సమాధిలోనే విడిచిపెట్టాడన్న మాట. యేసు నా పాపాన్ని తీసుకొని, దానితోపాటు మరణించి, నాకోసం కేవలం పాపక్షమాపణ, నూతన జీవాన్ని తీసుకొని తిరిగివచ్చాడు.

ఈ విషయాన్ని బైబిల్లో ఒక శక్తివంతమైన వచనం ఇలా వివరిస్తుంది: యేసు రక్తము మన పాపపు రక్తముకంటె మరి *'శ్రేష్టముగా పలుకుచున్నది'*.

ఈ కారణంగానే, మనము యేసునందు విశ్వాసముంచి, ఆయన క్షమాపణను అంగీకరించినప్పుడు, ఆయన బలిగా అర్పించిన రక్తాన్ని బట్టి, అనగా 'యేసు రక్తము'ను బట్టి మనము కృతజ్ఞులమైయుంటాము.

**నీవు ఆయన రక్తముచేత 'కడుగబడాలను కుంటున్నావా?'**

# ◈ ఆత్మ

యేసు సజీవుడు! ఆయన భౌతికంగా పరలోకంలో ఉన్నాడు. ఒకరోజున నీవు ఆయనను 'ముఖాముఖి' కలువవచ్చు.

అయితే, యేసు తన శిష్యులతో తాను త్వరలోనే ఈ లోకాన్ని విడిచి పరలోకం వెళ్లబోతున్నానని చెప్పినప్పుడు, ఈ విషయమై వాళ్లు సంతోషించాలి గాని దుఃఖపడకూడదని చెప్పాడు – ఎందుకంటే, పరిశుద్ధాత్మ వారియొద్దకు వచ్చి, వారిలో ఉంటాడు. [5]

యేసు భూమిమీద ఉన్నప్పుడు మనిషి ఆకారంలోనే ఉన్నాడు. అంటే, ఆయన ఒక ఊరిలో ఉన్నాడంటే, మరొక ఊరిలో లేడని అర్థం. యేసు తన సమాధాన హస్తాన్ని ఒకరి తలపై ఉంచాడంటే, మరొకరిపైన తన సమాధాన హస్తాన్ని పెట్టలేదని అర్థం. ఆయన మానవరూపంలో ఉన్నాడు, కాబట్టి మనలాగే ఆయన కాలానికి, స్థలానికి పరిమితుడయ్యాడు.

యేసు పరలోకానికి ఆరోహణమై వెళ్లినప్పుడు, స్వయంగా యేసు ఆత్మయైన పరిశుద్ధాతుడు సర్వలోకముమీద కుమ్మరించబడ్డాడు. అనగా, ఒకేసారి యేసు వ్యక్తిత్వము, ఆయన శాంతిసమాధానాలు ప్రతి ఊరిలోను, ప్రతి వ్యక్తియొక్క హృదయంలోను, ఇంటిలోను ఉండగలవన్న మాట. అలాగే, యేసు మనతో నడవడం మాత్రమే కాదు, మనలో నివసించగలడని కూడా దీని అర్థం.

ఇప్పుడు యేసు భూమిపై తన పనిని ముగించాడు గనుక – మనకు పాపక్షమాపణ, నిత్యజీవము అనుగ్రహించడానికి మరణించి, తిరిగి లేచాడు

---

[5] యోహాను 14:17,26,28.

గనుక – ఆయన భౌతికంగా పరలోకంలో ఉన్నాడు. పరిశుద్ధాత్మ ద్వారా ఇప్పుడు మనం ఆయనతో సంబంధం కలిగివుండగలం.

మనం యేసునందు విశ్వాసముంచినప్పుడు, తన పరిశుద్ధాత్మ ద్వారా ఆయన మనయొద్దకు వచ్చి, మన హృదయంలో, మన ప్రాణంలో, మన ఆత్మలో నివసిస్తాడు – 'దేవుడు మనకు తోడైయుంటాడు.'

**నీవు యేసయ్యను నమ్మి, ఆయన పరిశుద్ధాత్మను నీ హృదయంలోను, జీవితంలోను కలిగివుండాలని కోరుకుంటున్నావా?**

# ఆహ్వానము

“నేనే ద్వారమును, నా ద్వారా ఎవడైన లోపల ప్రవేశించిన యెడల వాడు రక్షింపబడినవాడైయుండును” అని యేసు చెప్పాడు (యోహాను 10:9).

***యేసయ్యను నీ హృదయంలోనికి, నీ జీవితంలోనికి ఇప్పుడే ఆహ్వానించాలనుకుంటున్నావా?***

ఇదొక ఆత్మీయ నిర్ణయం. నీ జీవితాన్ని యేసుకు అర్పించడం ద్వారా నీకు పాపక్షమాపణ, నిత్యజీవం లభిస్తాయి. యేసును ఎరిగిన మరుక్షణమే నీవొక నూతన మార్గంలో ఉన్నట్టే, అది *“పట్టపగలగువరకు... అంతకంతకు తేజరిల్లు”* మార్గము (సామెతలు 4:18).

నీవిప్పుడు ‘మరణము’ అనే వంతెనను దాటి జీవములోనికి ఇలా ప్రవేశించి, యేసుక్రీస్తును తెలుసుకోవచ్చు. నీవు ‘చేయవలసిన’ కీలకమైన పనులు 2 ఉన్నాయి. వాటిని ఈ క్రింద వివరిస్తున్నాను, ఆ తరువాత నీవు హృదయపూర్వకంగా చదివి, ‘ప్రార్థన’ చేయడానికి వీలుగా ఒక ప్రార్థనను రాసాను.

## *1. పాపమును గూర్చి పశ్చాత్తాపము:*

నీ పాపం విషయంలో నీవు పశ్చాత్తాపం చెందాలి. అవును, ఇది కష్టమైన పనే, కాని యేసయ్య నీనుంచి కోరుతున్నది ఇదే. దేవుని సహాయంతో నీ జీవితంలో ఉన్న పాపం నుంచి – *ధనాశ, శరీరాశ, దురాశ, మోసం, వ్యసనాలు, వ్యభిచారం, అశ్లీలసాహిత్యం,* మొ॥ వాటినుంచి వైదొలగుతానని నీవిప్పుడే ఒక నిర్ణయం తీసుకోవాలి.

పాపం విషయమై పశ్చాత్తాపం ‘హృదయానికి సంబంధించిన నిర్ణయం’, ఇది నీ జీవితంలోను, నీ ఇంటిలోను కనిపించాలి. కొన్నింటితో నీవు తెగతెంపులు

చేసుకోవాలి, స్పష్టంగా చెప్పాలి, పారవేయాలి, వైదొలగి, వదులుకోవాల్సి వుంటుంది... ఇప్పుడు నీవు పశ్చాత్తాపపడాలని నిర్ణయించుకుని, 'వెనుదిరిగి వస్తే' (పశ్చాత్తాపానికి అర్థం అదే), ఈ తదుపరి మెట్టుకు సరైన దిశగా నీవు అడుగులు వేసినట్టే.

## *2. యేసు క్రీస్తునందు విశ్వాసము*

నిజమైన ఏ బంధంలోనైనా, నమ్మకము, విశ్వాసము అనే 'సత్యము' యొక్క ప్రాధాన్యత గురించి మనం పైన చర్చించాం. తనయందు 'విశ్వాసముంచుమని' యేసు మనల్ని పిలుస్తున్నాడు. ఈ విశ్వాసపు అడుగు వేయుమని, తనయందు మీకున్న విశ్వాసమును గూర్చి బిగ్గరగా ప్రకటించుమని యేసు మనల్ని ఆహ్వానిస్తున్నాడు. నీ సొంత ప్రార్థనగా చేయడానికి వీలుగా క్రింద నేనొక ప్రార్థన రాసాను. ఈ ప్రార్థన నీ హృదయంలోనుంచి రావాలి, యథార్థంగా ఉండాలి.

ఒకవేళ నీవు నీ పాపం విషయమై పశ్చాత్తాపపడి, యేసు క్రీస్తునందు విశ్వాసముంచినట్లయితే, ఈ క్షణమే ఆయన నీ హృదయంలో తన పరిశుద్ధాత్మను ఉంచి, నీ పాపాలను క్షమించి, నీ పేరును పరలోకంలో రాస్తాడు!

## ప్రార్థన

ప్రియమైన యేసయ్యా, నీవు నన్ను ప్రేమించినందుకు వందనాలు. నా పాపం కోసం చనిపోయినందుకు నీకు వందనాలు. పాపక్షమాపణ, నిత్యజీవాన్ని నాకు ప్రసాదించినందుకు వందనాలు.

ఈరోజు నేను నా పాపం విషయమై పశ్చాత్తాపపడి, మారుమనస్సుపొంది నిన్ను నమ్మి, నీయందు విశ్వసిస్తున్నాను. నా పాపాన్ని క్షమించి, నీ పరిశుద్ధాత్మను నాపై కుమ్మరించుమని వేడుకొంటున్నాను.

ప్రభూ, నన్ను క్షమించినందుకు వందనాలు. యేసు ప్రభువా, నన్ను రక్షించినందుకు వందనాలు. నేనిప్పుడు నమ్మకంగా ఉండి, నిన్ను ముఖాముఖి చూసేవరకు, జీవితాంతం నిన్ను వెంబడించడానికి సహాయంచెయ్యమని యేసు నామంలో ప్రార్థిస్తున్నాను, ఆమేన్!

## ◈ క్రొత్త జీవితము

నీవు ఈ విశ్వాసపు అడుగువేసివుంటే, నీవు రక్షణ పొందావు! నీవు క్షమించబడ్డావు! నీవొక 'నూతన సృష్టి'. ఇది దేవుని సత్యం. ఇదే యేసు సందేశం.

క్రొత్తగా జన్మించిన 'విశ్వాసి'గా నీవు ప్రతిరోజూ బైబిల్ చదవడం, యేసయ్యతో కొన్ని నిమిషాలు ప్రార్థనలో గడపటం నిజంగా ఎంతో ముఖ్యం. ఒక మంచి క్రైస్తవ సంఘంలో చేరడం కూడా నిజంగా ముఖ్యమే. తద్వారా నీవు విశ్వాసంలోను, ఇతర విశ్వాసుల సహకారంలోను ఎదగడానికి వీలవుతుంది.

ఒకవేళ నీ దగ్గర బైబిల్ లేకపోతే, వెంటనే ఒకటి కొనుక్కో. మంచి తెలుగు బైబిల్‌తో పాటు ఇంగ్లీషులో, 'న్యూ ఇంటర్నేషనల్ వర్షన్' (ఎన్ఐవి) గాని, 'ఇంగ్లీష్ స్టాండర్డ్ వర్షన్' (ఈఎస్‌వి) గాని తీసుకో.

నేనైతే, రోజుకో అధ్యాయం చదువుతాను. బహుశా నీవు **లూకా** సువార్తతో ఆరంభించవచ్చు, ఆ తరువాత, మొత్తం బైబిలంతా చదువుకోవచ్చు....

ఓ మంచి, నమ్మకమైన చర్చి ఎక్కడుందో తెలుసుకో. ఈ నిర్ణయంలో నిన్ను నడిపించుమని ప్రార్థనలో యేసయ్యను అడుగు. ఏ చర్చికి వెళితే బావుంటుందో నీకు బాగా తెలిసిన నమ్మకమైన వ్యక్తిని అడిగి తెలుసుకో. వారానికోసారి చర్చికి వెళ్లడం ఒక ప్రాధాన్యతగా, ప్రభువుకోసం ఒక 'త్యాగం'గా చేసుకో. ఇది జరగాలంటే, మీ పనిపాటల్లో, మీ ఆర్థిక వనరుల్లో మార్పులు చేసుకోవాల్సివుంటుంది. ఇలా చేసినందుకు *ప్రభువు నిన్ను ఘనపరుస్తాడు!*

నీనుంచి వినాలని నేను ఆశిస్తున్నాను! నీవు ఈ విశ్వాసపు అడుగు వేసినట్లయితే, నా వెబ్‌సైట్‌లోనుంచి నాకొక ఈమెయిల్ పంపి, ఆ విషయాలు తెలియపరచు. నీతోపాటు నేనూ సంతోషిస్తాను, నీకోసం ప్రార్థన చేస్తాను!

నా సహోదరుడా, సహోదరీ, దేవుడు నిన్ను దీవించునుగాక! వ్యక్తిగతంగా మనం కలుసుకునేంత వరకు – యేసు నామంలో దేవుడు నిన్ను దీవించి, కాపాడి వర్ధిల్లచేయునుగాక!

**మరిన్ని వనరులకోసం, ఈ క్రింద ఇవ్వబడిన నా వెబ్‌సైట్‌ను దర్శించండి:**

www.1peter1three.weebly.com

***"యెహోవా నిన్ను ఆశీర్వదించి నిన్ను కాపాడును గాక; యెహోవా నీకు తన సన్నిధిని ప్రకాశింపజేసి నిన్ను కరుణించునుగాక; యెహోవా నీ మీద తన సన్నిధి కాంతి ఉదయింపజేసి నీకు సమాధానము కలుగజేయును గాక."***

(సంఖ్యాకాండము 6:24-26)

# ఉటంకించిన లేఖనములు

***తన యొద్దకు రమ్మని దేవుడు మనవిచేయుట:*** 2 కొరింథీ 5:20

***కేవలం క్రీస్తును, ఆయన లేఖనములను, తన ఆత్మను మాత్రమే తెలుసుకొనుట:*** 1 కొరింథీ 2:2–3

***బైబిల్ దైవప్రేరితం, బైబిల్‌ను తప్పుగా ఉపయోగించుట:*** హెబ్రీ 4:12/ యిర్మీయా 29:13 (మత్తయి 4:1–11; 2 కొరింథీ 4:2 కూడా చూడండి)

***పామరులైన లేఖన రచయితలు:*** అపొ.కా. 4:13

***యేసు అనగా, 'ప్రభువు రక్షించును':*** మత్తయి 1:21

***యేసు మానవరూపంలో ఉన్న దేవుడు:*** యెషయా 7:14/మత్తయి 1:23; యెషయా 9:6; యోహాను 1:1–5, 9, 14; యోహాను 8:58/ నిర్గమ 3:14; యోహాను 10:30; 14:9; 9:38/మత్తయి 14:33/నిర్గమ 20:5; యోహాను 5:46; కొలస్సీ 1:15–20; హెబ్రీ 1:3; ఫిలిప్పీ 2:6–11; జెకర్యా 14:9/ అపొ.కా. 4:12; ప్రకటన 1:13–18.

***పాపాలు క్షమించి, నిత్యజీవమివ్వడంలో యేసు ఉద్దేశము:*** లూకా 5:24; యోహాను 11:25–26; 4:13–14

***ప్రత్యక్షత – అర్థంచేసుకోవడం అసాధ్యం!:*** యోహాను 6:37, 65; మత్తయి 16:16–18; రోమా 11:33–36; యెషయా 55:8–9; కీర్తన 36:9; 2 కొరింథీ 4:6; యోహాను 4:24; 6:63.

***క్రీస్తునందు నమ్మకము:*** యోహాను 7:37-38; 11:25-26; 9:35; మత్తయి 11:28-30; లూకా 5:24; లూకా 10:20; యోహాను 10:9; యోహాను 5:39-40; యోహాను 15:13-15

***చూచినంత మాత్రాన నమ్మినట్లు కాదు:*** యోహాను 11:45, 53; మత్తయి 26:56; మార్కు 15:25 (ఉదయం 9.00) యోహాను 20:29; 2 కొరింథీ 4:6; 2 కొరింథీ 5:7; 1 యోహాను 3:2; 1 కొరింథీ 13:12

***దేవుడు అందరినీ సమానంగా ప్రేమిస్తాడు!***: 2 పేతురు 3:9; 1 తిమోతి 2:4; మత్తయి 18:14; యోహాను 3:16

***క్రీస్తును ఆరాధించుట, క్రీస్తును తిరస్కరించుట:*** యోహాను 9:38; మత్తయి 14:33; యోహాను 10:20; 2 కొరింథీ 5:16

***లోతైన స్థిరమైన ప్రత్యక్షత:*** మత్తయి 16:20; మార్కు 1:24,34,44; 4:11; యెషయా 6:9; 2 కొరింథీ 5:16; కీర్తన 42:7; మత్తయి 13:44

***రక్తము & క్రీస్తునందు స్వాతంత్ర్యము:*** యెషయా 1:18; కీర్తన 25:15; 2 కొరింథీ 5:17; గలతీ 2:2; లూకా 4:18/యెషయా 61:1; యెషయా42:3; 2 దినవృ. 7:14; 2 కొరింథీ 5:21; హెబ్రీ 9:22; 12:24

***ఆత్మ:*** యోహాను 14:1-4; ప్రకటన 1:13-18; 1 కొరింథీ 13:12; యోహాను 14:17, 26, 28

***ఆహ్వానము & నూతన జీవము:*** ఎఫెసీ. 1:13-14; కొలస్సీ. 1:27; సామెతలు 4:18; యోహాను 5:24; మార్కు 1:15; మత్తయి 3:8; అపొ.కా. 3:19; రోమా 10:9; లూకా 10:20; 2 కొరింథీ 5:17; హెబ్రీ 10:25; కీర్తన 1; యెహోషువ 1:9; హెబ్రీ 4:12/ 2 తిమోతి 3:16.